వనపర్తి జిల్లా పాన్‌గల్ సింగిల్ విండో కార్యాలయం ఎదుట యూరియా తీసుకెళ్లేందుకు వచ్చిన వాహనాలతో కిక్కిరిసిపోయిన ప్రాంతం

యూరియా కోసం తిప్పలు

వనపర్తి జిల్లా పాన్‌గల్‌లో రైతులకు తప్పని ఇక్కట్లు

పాన్‌గల్, ఫిబ్రవరి 14 : కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు కష్టాలు తప్పడం లేదు. కేసీఆర్ ప్రభుత్వంలో యూరియాకు కొరత లేదని, రేవంత్ సర్కారు వచ్చాక మళ్లా మునుపటి కష్టాలు మొదలైనట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం సింగిల్ విండో కార్యాలయంలో రైతులు యూరియా కోసం బారులు దీరారు. బస్తాలు తీసుకెళ్లేందుకు ఆటోలతో రావడంతో ఆ ప్రాంతం కిక్కిరిసిపోయింది. యూరియా వచ్చిందని తెలుసుకొన్న రైతులు పొద్దుగాలనే పట్టా పాసుపుస్తకాలతో విండో కార్యాలయం వద్దకు చేరుకొని టోకెన్ల కోసం ఎగబడ్డారు. మండల వ్యవసాయ అధికారి రాజవర్ధన్‌రెడ్డి ఒక్కో రైతుకు 5 బస్తాలకు టోకెన్లు అందజేశారు.

పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం రత్నాపూర్‌లో బొడ్రాయికి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్థులు

ఇండస్ట్రియల్ పార్కుకు భూములియ్యం

- తేల్చి చెప్పిన రత్నాపూర్ వాసులు
- గ్రామ దేవతలకు, తహసీల్దార్‌కు వినతిపత్రాల అందజేత

రామగిరి, ఫిబ్రవరి 14: ఇండస్ట్రియల్ పార్కుకు భూములిచ్చేది లేదని పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం రత్నాపూర్ గ్రామస్థులు తేల్చిచెప్పారు. రామగిరి ఖిల్లా మేడిపల్లి శివారులోని భూములను ఇండస్ట్రియల్ పార్కుకు ఇచ్చేది లేని స్పష్టం చేశారు. శుక్రవారం సమావేశమైన రైతులు మాట్లాడుతూ.. తమ గ్రామంలో పలు పనుల కోసం 2008లో అప్పటి ప్రభుత్వం 150 ఎకరాల భూమి తీసుకుందని, మళ్లీ ఇప్పుడు ఇండస్ట్రియల్ కారిడార్ కోసం 250 ఎకరాలు తీసుకోవడానికి చూస్తున్నదని, దీన్ని తాము వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికే తమ భూముల నుంచి రైల్వే లైన్, గ్యాస్‌పైపులైన్, పెద్ద టవర్ల లైన్, ఎల్లంపల్లి పైపులైన్ వేసినట్టు చెప్పారు. ప్రస్తుతం ఈ భూములు కూడా పోతే బతకం కష్టమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం గ్రామ దేవత బొడ్రాయితోపాటు రామగిరి తహసీల్దార్ సుమన్‌కు వినతి పత్రం అందజేశారు. వీరి ఆందోళనకు మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు మద్దతు పలికారు.

ప్రియాంక గాంధీకి పోస్ట్ కార్డులు పంపుతున్న విద్యార్థులు

ప్రియాంకగాంధీ.. స్కూటీ ఎక్కడ?

హామీలు అమలు చేయాలని ఓయూలో విద్యార్థినుల నిరసన

ఉస్మానియా యూనివర్సిటీ: గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థినులు శుక్రవారం అగ్ర నాయకురాలు ప్రియాంక గాంధీకి పోస్ట్ కార్డులు పంపుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మాట్లాడుతూ.. రూ. 4000 నిరుద్యోగ భృతి, విద్యార్థినులకు స్కూటీ ఇస్తామని హామీ ఇచ్చి గద్దెనెక్కి సంవత్సరం గడుస్తున్నా.. హామీల అమలుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా హామీలను అమలు చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో విద్యారంగం కుంటుపడిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రం లో విద్యాశాఖకు పూర్తిస్థాయి మంత్రి లేకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉండిపోయాయని వాపోయారు. ఈ సం దర్భంగా ప్రియాంక గాంధీజీ వేర్ ఈస్ మై స్కూటీ..వివాంట్ స్కూటీ అంటూ విద్యార్థినులు నినదించారు.

పంటలు ఎండిపోతున్నా పట్టదా?

- జనగామ ఎమ్మెల్యే పల్లా ఆగ్రహం

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ): రిజర్వాయర్లు నింపి జనగామ నియోజకవర్గంలోని ఆయకట్టు ప్రాంతానికి సాగునీరివ్వాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. దేవాదుల ప్రాజెక్టులో భాగంగా గండిరామారం, బొమ్మకూరు, కన్నెబోయినగూడెం, వెల్దండ, లద్నూర్, తపాస్పల్లి రిజర్వాయర్లను నింపాలని కోరారు. నాట్లు అయిపోయి సాగునీటి కోసం రైతుల తడ్లాడుతుంటే అధికారులు, ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదని శుక్రవారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆయన మండిపడ్డారు. సమస్యలపై సానుకూల చర్యలు తీసుకోకపోగా, అన్ని పంపులను బంద్ చేశారని ఆరోపించారు. వెంటనే అన్ని పంపులు, మోటార్లను ఆన్‌చేయకుంటే రైతులతో కలిసి పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలను చేపడతానని పల్లా హెచ్చరించారు.

సీసీఐ పత్తి కొనుగోళ్లలో భారీ స్కామ్

- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట, ఫిబ్రవరి 14 : సీసీఐ పత్తి కొనుగోళ్లలో భారీ కుంభకోణం జరిగిందని, వెంటనే సీబీఐతో విచారణ చేపట్టాలని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. సుమారు రూ.వెయ్యికోట్ల మేర అవినీతి జరగడం దారుణమని అన్నారు. శుక్రవారం ఆయన వరంగల్ జిల్లా నర్సంపేటలో మీడియాతో మాట్లాడారు. రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం నిలువు దోపిడీ చేసిందని విమర్శించారు. రాష్ట్రంలోని అన్ని వ్యవసాయ మార్కెట్లలో ఈ కుంభకోణం జరిగిందని, రైతులను కాంగ్రెస్ పార్టీ నిలువు దోపిడీ చేసిందని విమర్శించారు. సీఎం, వ్యవసాయశాఖ మంత్రి వెంటనే స్పందించి ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఈ కుంభకోణంపై వెంటనే సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

దీపాదాస్ మున్షీ ఔట్!

తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా మీనాక్షి నటరాజన్

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని అధిష్ఠానం పదవి నుంచి తొలగించింది. ఆమె స్థానంలో మధ్యప్రదేశ్‌కు చెందిన మీనాక్షి నటరాజన్‌ను నియమించింది. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మధ్యప్రదేశ్‌కు చెందిన ఆమె సుధీర్ఘకాలంగా కాంగ్రెస్‌లో పని చేస్తున్నారు. నిరుడు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పరిశీలకురాలిగా వ్యవహరించారు. పార్టీ పదవుల ఎంపికలో, ఇతర అంశాల్లో ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ జోక్యం ఎక్కువైందనే విమర్శలు వినిపించాయి. సీఎం రేవంత్‌రెడ్డికి, ఆమెకు మధ్య గ్యాప్ కూడా ఏర్పడినట్టుగా ప్రచారం ఉంది. ఈ నేపథ్యంలో అధిష్ఠానం ఆమెను తొలగిస్తూ నిర్ణయం తీసుకుంది.

32వ సారి ఢిల్లీకి సీఎం రేవంత్

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 32వ సారి ఢిల్లీకి వెళ్లారు. ఏఐసీసీ కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పిలుపు మేరకు శుక్రవారం రాత్రి ఆయన హుటాహుటిన ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. శనివారం కాంగ్రెస్ పెద్దలతో సమావేశం కానున్నారు. పీసీసీ కార్యవర్గాన్ని ఖరారు చేస్తారని సమాచారం. మొత్తం నాలుగు పోస్టులు ఉండగా, ఇప్పటికే ఒక్కో పోస్టుకు ముగ్గురు పేర్ల చొప్పున జాబితా సిద్ధమైందని కాంగ్రెస్ వర్గాలు చెప్తున్నాయి. ఇందులో నుంచి ఒక్కొక్కరిని ఎంపిక చేసి శనివారం జాబితా విడుదల చేస్తారని విశ్వసనీయ వర్గాల సమాచారం. మరో ముగ్గురు డిప్యూటీ సీఎంలను నియమించాలని భావిస్తున్నట్టు సమాచారం.

8500 సర్వే నంబర్లకు భరోసా బ్లాక్!

- వాటిలో ఎక్కువ భూమి ఉన్నట్టు గుర్తింపు
- మొత్తం భూమిని పక్కకుపెట్టిన సర్కార్
- 1.5-2 లక్షల ఎకరాల వరకు భూమికి కోత
- ఈ భూమికి రైతుభరోసా వేయాలా? వద్దా? అనే మీమాంసలో ప్రభుత్వం

హైదరాబాద్, ఫిబ్రవరి 14(నమస్తే తెలంగాణ): రైతుభరోసాలో 8,500 సర్వే నంబర్లను ప్రభుత్వం బ్లాక్ చేసినట్టు తెలిసింది. ఈ సర్వే నంబర్ల కింద సుమారు 1.5 లక్షల నుంచి 2 లక్షల ఎకరాల భూమి ఉన్నట్టు తెలిసింది. ఈ సర్వే నంబర్లు గల రైతుల పేర్లపై వాస్తవంగా ఉండాల్సిన భూమి కన్నా ఎక్కువ భూమి ఉన్నట్టు సర్వేలో గుర్తించినట్టు సమాచారం. దీంతో ఒక సర్వే నంబర్‌లో ఉండాల్సిన భూమి కన్నా ఎక్కువ భూమి ఏవిధంగా ఉంటుందనే సందేహంతో ఈ భూములను తాత్కాలింగా బ్లాక్‌లిస్టులో పెట్టినట్టు రెవెన్యూ శాఖ వర్గాలు తెలిపాయి. దీంతో ఈ సర్వే నంబర్లు గల రైతులకు రైతుభరోసాను బంద్ చేసినట్టు తెలిసింది.

నంబర్లు బ్లాక్.. రైతులు ఆగం

ప్రభుత్వం ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సర్వే నంబర్లను బ్లాక్ చేసి రైతుభరోసా వేయకపోవడంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు. ఇప్పటికే మూడెకరాల వరకు రైతుభరోసా జమ చేసినట్టు ప్రభుత్వం ప్రకటించింది. అయితే, మూడెకరాల లోపు గల వారికి కూడా రైతుభరోసా జమ కాకపోవడంతో సదరు రైతులు ఏఈవోల వద్దకు పరుగులు తీస్తున్నారు. తమకు రైతుభరోసా ఎందుకు రాలేదని ఆరా తీస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు వెబ్‌సైట్‌లో పరిశీలించగా ఆ సర్వే నంబర్లను చూపించడం లేదు. దీంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. సర్వే నంబర్లు బ్లాక్ చేయడంతో ఈ రైతులకు రైతుభరోసా రావడం లేదు. అయితే, ఈ రైతులకు రైతుభరోసా ఇవ్వాలా? వద్దా? అనే అంశంపై ప్రభుత్వం అయోమయంలో ఉన్నట్టు తెలిసింది. వీటిని మళ్లీ సర్వే చేసి ఎక్కువ భూమిపై సమీక్షిద్దామా? ఈసారికి రైతుభరోసా ఇచ్చేద్దామా? అనే అంశంపై చర్చిస్తున్నట్టు తెలిసింది.

జరిగింది ఇదీ..

రైతుభరోసా జమ చేసే క్రమంలో సర్వే నంబర్ల వారీగా, రైతుల పాస్ పుస్తకాల వారీగా భూ వివరాలను రెవెన్యూ శాఖ పోల్చి చూసినట్టు సమాచారం. ఇందులో సర్వే నంబర్లలో ఉన్న మొత్తం భూమితో పోల్చితే పాస్ పుస్తకాల్లో అధిక భూమి ఉన్నట్టుగా గుర్తించినట్టు తెలిసింది. ఉదాహరణకు ఒక సర్వే నంబర్‌లో పాత సర్వే ప్రకారం 10 ఎకరాలు ఉండగా, ఆ భూమి ఇతర రైతుల పేర్లపై మారగా సర్వే నంబర్లు బై నంబర్లుగా మారాయి. అయితే ఇప్పుడు ఆ నంబర్లన్నింటినీ పరిశీలించగా ఆ సర్వే నంబర్‌లో 12 ఎకరాల భూమి ఉన్నట్టుగా రెవెన్యూ శాఖ అధికారులు గుర్తించారని తెలిసింది. ఎక్కువగా వచ్చిన ఈ రెండెకరాల భూమి ఎక్కడిదనే అంశంపై అధికారులు కూపీ లాగుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ విధంగా వాస్తవ భూమి కన్నా ఎక్కువ భూమిని గుర్తించిన సర్వే నంబర్లను బ్లాక్ చేసినట్టు తెలిసింది.

బ్యాంకర్లు రైతు గేటు తీసుకెళ్లడం

ప్రభుత్వానికి అవమానకరం

- ఇందిరమ్మ ఇండ్లకు రూ.5లక్షలు సరిపోవని తెలుసు
- నాబార్డ్ సెమినార్‌లో మంత్రి తుమ్మల వ్యాఖ్యలు

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ): రుణం చెల్లించలేదనే కారణంతో జనగామ జిల్లా కొడకండ్ల మండలం ఏడునూతుల గ్రామానికి చెందిన రైతు ఇంటి గేటును బ్యాంకర్లు తీసుకెళ్లడం ప్రభుత్వానికి అవమానకరం అని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. 'నాబార్డ్ స్టేట్ క్రెడిట్ సెమినార్'లో ఆయన మాటాడుతూ.. రుణం తీర్చలేదని రైతు ఇంటి గేటును బ్యాంకర్లు తీసుకెళ్లినట్టు పేపర్లో చూశానని చెప్పారు. బ్యాంకుల్లో వేల కోట్ల రూపాయలు అప్పుగా తీసుకుని చెల్లించని వారిని ఏం చేస్తున్నారని ప్రజలు తమను నిలదీస్తున్నారని తుమ్మల ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వారి వద్ద నుంచి నగదును ఎందుకు రికవరీ చేయలేకపోతున్నారని బ్యాంకర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు రుణాలు ఎగ్గొట్టే ఉద్దేశం ఉండదని.. తల తాకట్టు పెట్టి అయినా రుణాలు తీరుస్తారని పేర్కొన్నారు. మరోసారి రైతులతో ఇలా ప్రవర్తించొద్దని బ్యాంకర్లను హెచ్చరించారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లకు రూ.5 లక్షలు ఇస్తున్నదని, అవి సరిపోవని తమకు తెలుసని చెప్పారు. ఇంకో లక్షన్నర ఇస్తే ఇల్లు కట్టుకునే వీలుంటుందన్నారు. ఆర్థికంగా ఉన్నవారికి రుణాలు ఇవ్వొద్దని మధ్య తరగతి కుటుంబాలకు ఇవ్వాలని కోరారు. రైతాంగానికి, పేదలకు 'స్టేట్ ఫోకస్ పేపర్' ఉపయోగపడేలా ఉండాలని అధికారులను తుమ్మల ఆదేశించారు.

మోదీ బీసీ కాదు..కన్వర్టెడ్

- ఉన్నత కులంలో పుట్టారు
- సీఎం అయ్యాక తన కులాన్ని బీసీ జాబితాలో చేర్చారు
- ప్రధాని మోదీపై సీఎం రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- కుల గణనలో ఎలాంటి తప్పులు జరగలేదని స్పష్టీకరణ
- నమస్తే తెలంగాణపై అక్కసు

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ): ప్రధాని మోదీ బీసీ కాదని, ఆయన లీగల్లీ కన్వర్టెడ్ బీసీ అని సీఎం రేవంత్‌రెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. గాంధీభవన్‌లో శుక్రవారం కులగణన నివేదికపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. మోదీది పుట్టుకతో ఉన్నత కులమని, 2001లో సీఎం అయిన తర్వాత తన కులాన్ని బీసీ జాబితాలో చేర్పించారని ఆరోపించారు. ఇక తమ ప్రభుత్వం చేపట్టిన కులగణనలో ఎలాంటి తప్పిదాలు లేవని స్పష్టం చేశారు. ఎస్సీ వర్గీకరణపై త్వరలోనే చట్టం చేస్తామని అన్నారు. కులగణనపై సొంత పార్టీ నేతలు చేస్తున్న విమర్శలపై సీఎం రేవంత్‌రెడ్డి పరోక్షంగా స్పందించారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేసిన విమర్శలపై స్పందిస్తూ.. తమ పార్టీ నేతలు కూడా కులగణన లెక్కల్ని తప్పు పడుతున్నారని, ఇది మంచిదికాదని అన్నారు. అలా చేయడం వల్ల బీసీల పరిస్థితి మళ్లీ మొదటికి వస్తుందని చెప్పారు. రాష్ట్రానికి రేవంత్‌రెడ్డే చివరి రెడ్డి సీఎం అంటూ తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలపైనా ఆయన స్పందించారు. తాను చివరి రెడ్డి సీఎం అయినా పర్వాలేదని, తమ నాయకుడు రాహుల్‌గాంధీ లక్ష్యం కోసం పనిచేస్తున్నట్టు తెలిపారు.

నమస్తే తెలంగాణపై అక్కసు

ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి 'నమస్తే తెలంగాణ'పై అక్కసు వెళ్లగక్కారు. పలు మార్లు నమస్తే తెలంగాణను పరోక్షంగా ప్రస్తావిస్తూ విమర్శించారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై నమస్తే తెలంగాణ వరుస కథనాలతో ప్రజలకు అండగా నిలుస్తున్న విషయం తెలిసిందే. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వాటిని అడ్డుకుంటున్నది. దీంతో ప్రభుత్వానికి నమస్తే తెలంగాణ దినపత్రిక కంటగింపుగా మారింది. ఇప్పటికే పలు సందర్భాల్లో అంతర్గత సమావేశాల్లో నమస్తే తెలంగాణపై విమర్శలు గుప్పించిన సీఎం రేవంత్‌రెడ్డి తొలిసారి బహిరంగ వేదికపై తన అక్కసు వెళ్లగక్కారు.

ప్రధాని మోదీ కులాలకు అతీతం

ప్రధాని మోదీపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీజేపీ నేతలు మండిపడుతున్నారు. ప్రధానిని కులాలకు అతీతంగా అందరూ ప్రేమిస్తారని పేర్కొన్నారు. సీఎం వ్యాఖ్యలు బీసీ రిజర్వేషన్ నుంచి ప్రజల దృష్టిని మళ్లించే కుట్ర అని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. మోదీని తిడితే ఏమవుతుందో రేవంత్‌కు త్వరలోనే తెలిసి వస్తుందని ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. రేవంత్ తన పదవిని కాపాడుకునేందుకే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తెలిపారు.

పంట రుణాల్లో భారీ కోత

- నిరుటితో పోలిస్తే రూ.3,646 కోట్లు తగ్గుదల
- వచ్చే ఏడాదికిరూ.3.86లక్షల కోట్లతో రుణ ప్రణాళిక
- నాబార్డ్ ఫోకస్ పేపర్ విడుదల చేసిన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ): వచ్చే ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ పంట రుణాల్లో భారీ కోత పడింది. నిరుటితో పోలిస్తే రూ.3,646 కోట్లు తగ్గింది. నిరుడు పంట రుణాల లక్ష్యం రూ.90,794 కోట్లు కాగా, ఆ మొత్తాన్ని జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంక్(నాబార్డు) రూ.87,148 కోట్లకు తగ్గించింది. 2025-26 సంవత్సరానికిగాను పంట ఉత్పత్తి, మార్కెటింగ్, టర్మ్ లోన్లకు రూ.1.39లక్షల కోట్ల రుణాలు ఇచ్చేందుకు నాబార్డు ప్రణాళిక రూపొందించింది. ఇందుకు సంబంధించిన స్టేట్ ఫోకస్ పేపర్‌ను శుక్రవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హైదరాబాద్ అమీర్‌పేట్‌లోని మ్యారిగోల్డ్ హోటల్‌లో నిర్వహించిన 'నాబార్డ్ స్టేట్ క్రెడిట్ సెమినార్'లో విడుదల చేశారు. ఈ ఆర్థిక సంవత్సరానికి గానూ మొత్తం వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.1.62 లక్షల కోట్లు రుణాలు ఇవ్వాలని నాబార్డు లక్ష్యంగా పెట్టుకున్నది. రాష్ట్రానికి అంచనా వేసిన రుణ సామర్థ్యం మొత్తం రూ.3.86 లక్షల కోట్లు అని వెల్లడించింది. ఇది గత ఏడాదితో పోలిస్తే 37.80 శాతం వృద్ధిని సూచిస్తున్నదని పేర్కొంది. ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే అగ్రగామిగా నిలిచేందుకు అద్భుతమైన పురోగతి సాధించిందని నాబార్డు తెలిపింది. దేశ మొత్తం బియ్యం ఉత్పత్తికి ఇది 12 శాతం తోడ్పతుందని స్పష్టం చేసింది. పౌల్ట్రీ ఉత్పత్తిలో రాష్ట్రం మూడో స్థానంలో నిలిచిందని పేర్కొంది.

ధరలు వచ్చే పంటలకు మద్దతు: భట్టి

అత్యధిక ధరలు వచ్చే పంటలు పసుపు, మామిడికి నాబార్డు మద్దతుగా నిలవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కోరారు. సేంద్రీయ వ్యవసాయదారులు, స్వయం సహాయక సంఘాలను నాబార్డు ప్రోత్సహించాలని సూచించారు.

నెరవేరని రుణాల లక్ష్యం

పంట రుణాల విషయంలో బ్యాంకులు ఎంచుకున్న లక్ష్యాలు క్షేత్రస్థాయిలో అందుకోవడం లేదు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.73,437 కోట్ల రుణ లక్ష్యం విధించుకోగా రూ.64,939 కోట్ల రుణాలను మంజూరు చేశాయి. 2024-25లో రూ.90,794కోట్లు లక్ష్యంగా విధించుకోగా ఇందులో 70 శాతం మాత్రమే రుణాలు మంజూరైనట్టు తెలిసింది.

వ్యవసాయశాఖ బడ్జెట్ 42వేల కోట్లు!

2025-26 సంవత్సరానికి గాను ప్రభుత్వం వ్యవసాయ రంగానికి రూ. 42వేల కోట్ల బడ్జెట్ కేటాయించే అవకాశముందని తెలుస్తున్నది. ఈ మేరకు వ్యవసాయశాఖ ప్రతిపాదనలను ప్రభుత్వానికి అందించినట్టుగా తెలిసింది. సుమారు రూ.18వేల కోట్లు రైతుభరోసాకు, రూ.1500 కోట్లు రైతుబీమాకు పోగా మిగిలిన రూ.20వేల కోట్లలో ఎక్కువ భాగం వేతనాలకే వెచ్చించినట్టు సమాచారం.

వివిధ రంగాలకు వ్యవసాయ రుణ ప్రణాళిక

వ్యవసాయ రుణాలు	రూ.1,62,946 కోట్లు (పంట రుణం 87,148 కోట్లు)
సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు	2,03,565 కోట్లు
ఎగుమతుల కోసం రుణాలు	611 కోట్లు
విద్య	2486 కోట్లు
గృహ నిర్మాణం	10,493 కోట్లు
సామాజిక మౌలిక సదుపాయాలు	1530 కోట్లు
పునరుత్పాదక శక్తి	570 కోట్లు
ఇతర రంగాలకు..	3652 కోట్లు
మొత్తం	3,85,854 కోట్లు

ఇరిగేషన్ ఇంజినీర్లకు వేతనాల్లేవ్

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ): ఇరిగేషన్ శాఖ అవసరాల కోసం బదిలీ అయిన 25 మంది ఇంజినీర్లకు జీతాలు చెల్లించేందుకు ఆర్థికశాఖ మోకాలడ్డుతుండటంతో వారు ఆర్థికంగా చితికిపోతున్నారు. బదిలీలపై నిషేధం ఉన్న సమయంలో ఎలా బదిలీ చేస్తారని? ఇది నిబంధనలకు విరుద్ధమంటూ వేతనాలను నిలిపివేసింది. వాస్తవానికి ప్రభుత్వం నిరుడు వర్షాకాలం ప్రారంభంలో శాఖాపరమైన బదిలీలపై నిషేధం ఎత్తివేసింది. ఆ ఉత్తర్వుల నుంచి ప్రభుత్వం ఇరిగేషన్ శాఖను మినహాయించింది. ఆ తరువాత అవసరాల రీత్యా బదిలీలు చేపట్టింది. కానీ ఆర్థిక శాఖ అధికారు లు వేతనాలు విడుదల చేయడం లేదు.

కోడ్ నుంచి మినహాయించాలి

ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ వినతి

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీ కార్మిక సంఘాలతో లేబర్ కమిషనర్ జరిపే చర్చలకు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నుంచి మినహాయించాలని ఆర్టీసీ జేఏసీ నాయకులు ఎన్నికల కమిషన్‌కు విన్నవించారు. శుక్రవారం జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ థామస్‌రెడ్డి, కో కన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేశ్ ఆధ్వర్యంలో నాయకులు రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.

కులగణన ప్రజెంటేషన్‌పై పట్టింపేది..!

- గాంధీభవన్‌లో ఒకే సమయంలో రెండు కార్యక్రమాలు
- యూత్ కాంగ్రెస్ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగం
- పక్కనే హాలులో భట్టి విక్రమార్క పవర్ ప్రజెంటేషన్
- సీఎం ప్రసంగం పూర్తికాగానే వెళ్లిపోయిన నేతలు
- కూర్చోవాలంటూ బతిమాలినా పట్టించుకోని వైనం

హైదరాబాద్, ఫిబ్రవరి 14(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సర్కారుకు, పార్టీకి కులగణనపై పట్టింపులేని విషయం గాంధీభవన్ సాక్షిగా బయటపడింది. పార్టీ ఎమ్మెల్యేలకు, నేతలకు కులగణనపై సందేహాలు నివృత్తి చేసేందుకు, అవగాహన కల్పించేందుకు గానూ శుక్రవారం గాంధీభవన్‌లో నిర్వహించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ గందరగోళంగా మారింది. ముఖ్యమైన కులగణన అంశంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తుంటే, సీఎం రేవంత్‌రెడ్డి గాంధీభవన్‌లోనే ఇతర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఒకే సమయంలో రెండు కార్యక్రమాలు ఉండడంతో నేతలు, కార్యకర్తలంతా ఎటు పోవాలో తేల్చుకోలేక గందరగోళంలో పడ్డారు.

ప్రజెంటేషన్ పూర్తయ్యాక వచ్చిన సీఎం...

ఇటీవల యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన జక్కిడి శివ చరణ్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి మొదట సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. అదే సమయంలో గాంధీభవన్‌లోపల హాలులో కులగణనపై పార్టీ నేతలకు భట్టి విక్రమార్క పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్నారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడి బాధ్యతల స్వీకరణ ముగిశాక కులగణనపై ప్రజెంటేషన్ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. అప్పటికే భట్టి విక్రమార్క ప్రజెంటేషన్ దాదాపుగా పూర్తయింది.

బతిమాలినా పట్టించుకోలే..

భట్టి విక్రమార్క ప్రజెంటేషన్ పూర్తికాగానే సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. సీఎం ప్రసంగం పూర్తికాగానే నేతలు, కార్యకర్తలంతా వెళ్లిపోవడం ప్రారంభించారు. అయితే ఇంకా ఎస్సీ వర్గీకరణపై మంత్రి దామోదర రాజనర్సింహ పవర్ ప్రజెంటేషన్ ఇవ్వాల్సి ఉంది. అయినప్పటికీ ఎవరూ పట్టించుకోకుండా వెళ్లిపోయారు. అప్పటికే పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ నేతల్ని, కార్యకర్తల్ని బతిమాలినా పట్టించుకోలేదు. ఒకే సమయంలో రెండు కార్యక్రమాలు నిర్వహించడం, కులగణన ప్రజెంటేషన్‌కు సీఎం ఆలస్యంగా హాజరవడంపై సొంతపార్టీ నేతలు విమర్శలు గుప్పించారు.

ప్రజా సమస్యలపై పోరాడాలి యూత్ కాంగ్రెస్‌కు సీఎం రేవంత్ పిలుపు

నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని యూత్ కాంగ్రెస్ నేతలకు సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. గాంధీభవన్‌లో శుక్రవారం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా శివచరణ్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. పదవులు వస్తాయో రావో తెలియదని, పదవులు ఆశించి పనులు చేయొద్దని చెప్పారు. ఇక ఢిల్లీలో పైరవీలు చేసి పదవులు తెచ్చుకుందామనుకోవటం భ్రమేనని స్పష్టం చేశారు. అలాంటి వాళ్లకు తాను పదవులు ఇవ్వబోనని తేల్చిచెప్పారు. ఫ్లెక్సీలు పెట్టి, దండం పెడితే సరిపోదని, తనకు ఒక దండం పెడితే తాను రెండు దండాలు పెడుతానని, పదవులు మాత్రం ఇవ్వబోమని అన్నారు.

ఉపాధి వనరుగా పర్యాటక రంగం

పర్యాటక, విద్యారంగాలపై సమీక్షలో సీఎం రేవంత్ రెడ